క్లుప్తంగా

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న ముత్తాయవలస గ్రామస్తులు

బొబ్బిలి రూరల్: ఎల్లమ్మ సంబరాల ముగింపు సందర్భంగా మండలంలోని ముత్తాయవలస గ్రామంలో సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కార్యక్రమానికి హాజరై, అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

నేటి నుంచి ఎల్లమ్మ పండగ



ముస్తాబైన ఎల్లమ్మ

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో ఎల్లమ్మ పేరంటాల పండగ మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఎ.గోపీనాథ్, జి.వెంకటరావు, జి.శంకరరావు, బి.సత్యం, వెంకటస్వామి సోమవారం వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంబరాల్లో మంగళవారం అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించడం జరుగుతుందని, బుధవారం గ్రామంలోని బంధువులకు అన్న సంతర్పణ, గురువారం గండి కుటుంబీకులకే పరిమితమైన వంటకాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆ తర్వాత పేరంటాలు అమ్మవారు ముగడ కన్నవారు, తెంటువలస అత్తవారైన గండి రామలక్ష్మి మీదవాలి భవిష్య వాణి వినిపిస్తుందన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



సమావేశానికి హాజరైన సచివాలయ, హౌసింగ్ ఉద్యోగులు

బొబ్బిలి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సన్నద్ధం చేయడంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి, ఉగాది నాటిక సామూహిక ప్రవేశాలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరిగే సమీక్ష సమావేశం నాటికి 40 శాతం బ్రిక్ వర్క్ పూర్తికావాలని, నిర్మాణాల్లో 70 శాతం లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ అర్బన్ డీఈఈ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ స్టిమ్యులేషన్ మెషిన్ వితరణ



భవిత కేంద్రానికి స్టిమ్యులేషన్ మెషిన్ అందజేస్తున్న దృశ్యం

రాజాం/రాజాం సిటీ: స్థానిక భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ స్టిమ్యులేషన్ మెషిన్‌ను సీతామహాలక్ష్మి పౌల్ట్రీ డైరెక్టర్ ఆత్మకూరి శ్రీనివాసరావు వితరణ చేశారు. దివ్యాంగ విద్యార్థుల సౌకర్యార్థం దీనిని కార్యాలయంలోని సిబ్బందికి సోమవారం ఆయన కార్యదర్శి కృష్ణ అందజేశారు. దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఐఈఆర్‌పీ ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు తెలిపారు.

చీరల పంపిణీ



చీరలు అందుకున్న మహిళలతో మదర్ థెరీసా ట్రస్ట్ నిర్వాహకులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న నిరుపేదలకు మదర్ థెరీసా ట్రస్ట్ నిర్వాహకులు క్లెవ్ఫ్ కూపర్ సోమవారం చీరలు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఫిబ్రవరి 13వ తేదీన యుగోస్లేవియా నుంచి ఇండియాకు మదర్ థెరీసా వచ్చిన సందర్భంగా వీటిని అందజేసినట్లు క్లెవ్ఫ్ కూపర్ తెలిపారు. కార్యక్రమంలో టి.సత్యనారాయణ, ఎస్.సాంబయ్య, కె.మహేష్‌పట్నాయక్, ఎస్.గోపి, బ్రదర్ సైమన్ తదితరులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య సమావేశం

బొబ్బిలి రూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఏపీఎం పీఏ స్వామి సమావేశానికి హాజరై, రుణాల రికవరీ శాతం పెంచాలని, సంఘాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

- సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డోల రాజేశ్వరరావు



తెర్లాం: ఉద్యోగులకు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎన్నికల ప్రాదేశిక నియమావళిని తూ.చ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని తహసీల్దార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డోల రాజేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ప్రాదేశిక నియమావళిపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లు, వాల్ పోస్టర్లను తొలగించాలని తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయినంత వరకు గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన జెండాలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లు ఏవీ ఉండకుండా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీల జెండాలు, బ్యానర్లను తొలగించే సమయంలో సచివాలయ ఎంఎస్‌కేల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎస్‌ఐ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో 729 మంది ఓటర్లు..

బాడంగి: ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో అన్నిచోట్ల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేయాలని తహసీల్దార్, సహాయ రిటర్నింగ్ అధికారి బాలమురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలో మొత్తం 729 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారని, వీరిలో 519 మంది పురుష ఓటర్లు, 210 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. సోమవారం నాటితో ఓటర్ల నమోదు గడువు పూర్తి కావడంతో మరో 15 కొత్త దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఎంపీడీఓ అక్కారావు, ఎస్‌ఐ జయంతి, హెచ్‌డీటీ చిన్నంనాయుడు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



బొబ్బిలి రూరల్: తుది ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు



బొబ్బిలి రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో సిద్ధం చేసిన బ్యాలెట్ బాక్సులు

ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు..

బొబ్బిలి రూరల్: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం వరకు ఓటర్ల నమోదుకు గడువు పొడిగించడంతో ఇప్పటివరకు తుది ఓటర్ల జాబితా సిద్ధం కాలేదు. అభ్యర్థుల దరఖాస్తులను తహసీల్దార్ ఎన్.రాజారావు పరిశీలిస్తున్నారు. 4,534 మంది ఓటర్లు ఉండగా, 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్ల సంఖ్య ఇంకా పెరిగే నేపథ్యంలో మరో రెండు పోలింగ్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్నారు. మొత్తం 162 బ్యాలెట్ బాక్సులు ఉండగా, అవసరం మేరకు అదనపు బ్యాలెట్ బాక్సులు తీసుకుంటామని ఆయన అన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్లు లేకుండా చూస్తున్నామని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండడంతో పాటు సామాజిక సేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో ఉన్న శ్రీరామ ధర్మక్షేత్రంలో వారణాసి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన చెట్లు ఫలాలను కాసి ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, నదులు ప్రవహిస్తూ జీవరాశికి నీరందిస్తూ ఉపయోగపడుతున్నాయని, గోవులు కూడా పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయని తెలిపారు. మానవుని శరీరం కూడా పరుల కోసం ఉపయోగపడాలని, మానవుడు పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదని, ప్రాణం పోయేటప్పుడు కూడా ఏమీ తీసుకువెళ్లడని వివరించారు. బ్రతికి ఉన్నన్నాళ్లు మంచి, చెడులు మాత్రమే మన వెంట వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మంచి భావాలు కలిగి ఉండాలన్నారు. వీలైతే ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని కోరారు. జగన్నాథస్వామి చిరు వ్యాపారి అయినప్పటికీ నిత్యం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గొర్లె దామోదరరావు, సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు అష్టాదశ వార్షిక మహోత్సవాలు

బొబ్బిలి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మంగళ, బుధవారాల్లో అష్టాదశ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వేమకోటి ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 14వ తేదీన ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం, 15వ తేదీన మహాకుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు.

20 మద్యంబాటిళ్ల స్వాధీనం

తెర్లాం: స్థానిక పట్టణంలో చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆర్.రమేష్ సోమవారం వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి, మండలంలోని కూనాయవలస పంచాయతీ, జన్నివలస గ్రామానికి చెందిన గెంబలి కృష్ణ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళలకు కుట్టుశిక్షణ



పేపర్ కటింగ్ చేస్తున్న మహిళలు

బొబ్బిలి రూరల్: మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. సోమవారం ట్రైనర్ లావణ్య శిక్షణార్థులకు పేపర్, క్లాత్ కటింగ్ నేర్పించారు. ఈ బ్యాచ్‌లో దాదాపు 30 మందికి ఫ్యాషన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వలసల నివారణకే 'ఉపాధి' పనులు

- ఉపాధి పనుల పరిశీలనలో ఎంపీడీఓ బానూరి శంకరరావు



రాజాం: వీఆర్ అగ్రహారంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నాయని ఎంపీడీఓ బానూరి శంకరరావు అన్నారు. సోమవారం మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశించిన కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టార్పాలిన్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం అంతకాపల్లి, పొగిరి సచివాలయాలను ఆయన సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, మంచి ఉద్యోగులుగా పేరుతెచ్చుకోవాలని కోరారు.



రేగిడి: వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామ బెవరవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ప్రారంభం కావడంతో ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయంలో పనులకు వెళ్లాలని, నాణ్యత మేర పనులు చేపట్టాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారికే పనులకు అనుమతించాలని, పని చేస్తున్న వారికే మస్తరు వేయాలని సూచించారు.

'స్పందన'కు అధికారులంతా హాజరుకావాలి



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఐజాక్

వంగర: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి హాజరైన ఆయన గ్రామ సచివాలయాల్లో స్పందన నిర్వహించడం ద్వారా ఏ గ్రామంలోని సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. మండల స్థాయిలో వచ్చే వినతులను కూడా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావులు స్పందన వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.01 లక్షలకు వాహనాల వేలం

రాజాం సిటీ: స్థానిక రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో వివిధ ఎస్ఈబీ కేసుల్లో పట్టుకున్న వాహనాలను సోమవారం వేలం నిర్వహించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి సమక్షంలో జరిగిన ఈ వేలంలో నాలుగు ద్విచక్రవాహనాలు, ఓ ఆటోను దక్కించుకునేందుకు పాటదారులు పోటీపడ్డారు. మొత్తం రూ.1,01,008లకు వాహనాలను దక్కించుకున్నారని ఎస్ఈబీ ఎస్‌ఐ పిచ్చేశ్వరరావు తెలిపారు. అలాగే వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 కేసుల్లో పట్టుబడిన 284 లీటర్ల సారా, ఎనిమిది కేసుల్లో పట్టుబడిన 92 మద్యంబాటిళ్లను ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో రాజాం టౌన్, రూరల్ సీఐలు సీఐ కె.రవికుమార్, హెచ్.ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామ సచివాయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, అధికారుల హాజరు, స్పందన వినతుల స్వీకరణ, గ్రామ వలంటీర్ల పనితీరును పరిశీలించి, సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలపై ఆరాతీశారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేశామని తెర్లాం తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఆమిటి గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ వద్ద 450 టన్నుల ధాన్యం ఉందని, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటికే ఈ-క్రాప్ చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో నెలకొన్న ధాన్యం కొనుగోలు సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతుల వద్ద ఉన్న ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేంత వరకు ధాన్యం నిల్వ ఉంచాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు.

ఫైలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



తెర్లాం హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: ఫైలేరియా వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు వ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు, చిన్నారుల కడుపులో పెరిగే నులిపురుగుల నివారణకు అవసరమైన ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులతో మింగించాలన్నారు. దోమల కారణంగా ప్రబలే ఫైలేరియా వ్యాధిని నివారించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రెండేళ్ల వయసు చిన్నారుల నుంచి ఏ వయసు వారికైనా కడుపులో నులిపురుగులు పెరిగే అవకాశం ఉందని, నులిపురుగుల ద్వారా రక్తహీనత, ఇతర వ్యాధులు సోకుతాయన్నారు. వీటి నివారణకు వైద్య సిబ్బంది ఇచ్చిన మాత్రలు వేసుకోవాలని కోరారు. ఫైలేరియా వల్ల కలిగే అనర్థాలను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ వివరించారు. ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి, ఎంఈఓ త్రినాథరావు, హెచ్‌ఎం పాపారావు, అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, ఏఎన్‌ఎం ప్రశాంతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'నవధాన్యాల సాగు- నేలతల్లి బాగు'



రాజాం: నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ మానవహారం చేపట్టిన విద్యార్థులు

రాజాం: మండలంలోని మారేడుబాక గ్రామంలో నవధాన్యాలు, చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులంతా నవధాన్యాల సాగు-నేల తల్లి బాగు, రాగులు స్వీకరించు-రోగాలు నివారించు అని నినాదాలు చేశారు. నవధాన్యాల సాగు వల్ల భూసారం పెరగడమే కాకుండా సూక్ష్మజీవులు, వానపాములు భూమిలో వృద్ధి చెంది, జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. అలాగే భూగర్భ కార్బన్, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నారాయణమ్మ, రేఖ, నీలవేణి పాల్గొన్నారు.



రేగిడి: జీవామృతం తయారీని వివరిస్తున్న ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ

రేగిడి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణలు ప్రకృతి వ్యవసాయంపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు ఇంటికి అవసరమైన కూరగాయలు, పండ్లు, అరటికాయలను చక్కగా పండించుకోవచ్చన్నారు. రసాయన, పురుగు మందుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులతో సేద్యం చేస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడమే కాకుండా అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం ఆవుపేడ, వేపాకులు, గోమూత్రం వంటి వాటితో జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆశీలు కాంట్రాక్టర్ ఆస్తి జప్తు



ఆస్తి జప్తు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ ఆశీలు కాంట్రాక్టర్ సావు మాణిక్యం ఆస్తిని అధికారులు సోమవారం జప్తు చేశారు. మున్సిపల్ మార్కెట్ ఆశీలు పాట రూ.12 లక్షలకు పాడి, ఇప్పటివరకు రూ.7.20 లక్షలు చెల్లించారు. బకాయి మొత్తం చెల్లించాలని నాలుగైదు కోర్టు నోటీసులు ఇచ్చినా సదరు కాంట్రాక్టర్ స్పందించకపోవడంతోనే చర్యలు తీసుకున్నట్లు ఆర్‌ఐ సురేష్ తెలిపారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



రేగిడి: లక్ష్మీపురం పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ తిరుమలప్రసాద్‌తో సోమవారం సమావేశమైన ఆయన మండలంలో పాఠశాలల నిర్వహణ తీరు, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు, జగనన్న గోరుముద్ద పథకాలతో పాటు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందజేసి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులే భావిభారత పౌరులను తీర్చిదిద్దగలరన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించడంతో పాటు అంకితభావంతో పనిచేస్తూ విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా..

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈఓ త్రినాథరావు సూచించారు. మండలంలోని రామన్నఅగ్రహారం ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల పాఠ్యాంశాల ప్రణాళికలు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులకు సక్రమంగా విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.



తెర్లాం: రామన్నఅగ్రహారం పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు



రామభద్రపురం: ఎంఈఓకు సూచనలిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

విద్యాప్రమాణాలపై ఎంఈఓ సంతృప్తి..

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యాప్రమాణాలు బాగున్నాయని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలు, లెస్సన్ ప్లాన్‌లు చూసి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు. పాఠశాలలో నాడు-నేడు పథకం కింద నిర్మించిన తాగునీటి ప్లాంట్‌ను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురపాక వెంకటరమణ, సీఆర్‌పీ కెంబూరు చంద్రరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.